క్లుప్తంగా

జాతీయ యూనిఫెస్ట్‌లో నిహారికకు రజతం



తెనాలి: న్యూఢిల్లీలోని అమిటి యూనివర్సిటీ నోయిడాలో జాతీయస్థాయిలో నిర్వహించిన 38వ యూనిఫెస్ట్‌లో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి పాల్గొన్న తెనాలికి చెందిన నలుకుర్తి నిహారికకు స్కిట్ విభాగంలో రజత పతకం సాధించింది. నిహారిక పద్మావతి విశ్వవిద్యాలయంలో బీటెక్(కంప్యూటర్ సైన్స్) ఫైనలియర్ చదువుతోంది. జాతీయస్థాయి యూనిఫెస్ట్‌కు విశ్వవిద్యాలయం బృందంతో కలిసి పాల్గొంది. సాంస్కృతిక అంశాల్లో నిర్వహించిన పోటీల్లో నిహారిక బృందం ప్రదర్శించిన స్కిట్ ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం అందుకుంది.

లోక్‌అదాలత్‌తో అందరికీ మేలు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కొరకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో 254 కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, లోక్ అదాలత్ మెంబర్లు ఖాదర్ హుస్సేన్, పి.రమేష్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అన్నం పిన్నారావు పాల్గొన్నారు.

ఆలపాటికి ఘన స్వాగతం



తెనాలిరూరల్: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలసి తెనాలి విచ్చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. నియోజకవర్గ ముఖద్వారం సంగంజాగర్లమూడికి శనివారం సాయంత్రం చేరుకున్న ఆయన ఇక్కడి వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా నాజరుపేటలోని ఎన్‌వీఆర్ కన్వెన్షన్ సెంటరుకు రాత్రి 9.30 గంటలకు చేరుకున్నారు. అడుగడుగునా గజమాలలతో కార్యకర్తలు ఆలపాటికి స్వాగతం పలికారు. ర్యాలీలో లీడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఇతర నాయకులు ఉన్నారు.

లోక అదాలత్‌లో

30 కేసులు పరిష్కారం

వేమూరు: లోక్ అదాలత్ ద్వారా 30 ఎక్సైజ్ కేసులు పరిష్కారం అయ్యాయని ఎక్సైజ్ సీఐ ఎ.రవి కుమార్ తెలిపారు. తెనాలి కోర్టులో శనివారం జరిగిన లోక అదాలత్‌లో వేమూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 16 మే 2020 నుంచి 15 అక్టోబరు 2024 వరకు నమోదు చేసిన కేసుల్లో 30 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కేసులు ఉన్న వ్యక్తుల నుంచి రూ. 1,77,300 కాంపౌండింగు ఫీజు వసూలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

తబలిస్టు శేఖర్‌బాబు కుటుంబానికి ఆర్థికసాయం

తెనాలి: ప్రముఖ తబలా విద్వాంసుడు కిర్లంపల్లి శేఖర్‌బాబు(75) అంత్యక్రియల నిమిత్తం కళల కాణాచి, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సంయుక్తంగా రూ.10 వేల ఆర్థికసాయాన్ని శనివారం ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. స్థానిక వైకుంఠపురం దగ్గర్లోని పోతురాజు కాలనీలో ఉంటున్న శేఖర్‌బాబు శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ, కోశాధికారి దీపాల సుబ్రహ్మణ్యం, కనపర్తి మధుకర్, చందు సూర్య, కళల కాణాచి సంయుక్త కార్యదర్శి కొండముది రమేష్‌బాబు పాల్గొన్నారు. ఆయనకు భార్య, కుమార్తె, మనవ సంతానం ఉన్నారు. శనివారం ఆయన అంత్యక్రియలు పూర్తిచేశారు.

'బేతేలు' వ్యవస్థాపకులు ప్రకాశం మృతి

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని బేతేలు ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు కొనకాల ప్రకాశం (94) శనివారం ఉదయం మృతి చెందారు. ఆయన భూస్థాపన కార్యక్రమం ఆదివారం జరుగుతుందని చర్చి నిర్వాహకులు కొనకాల అబ్రహాం తెలిపారు. ప్రకాశం ఆరు దశాబ్దాలుగా ప్రభువు సేవలో కొనసాగారని తెలిపారు.

నూతన డీఈగా భాస్కరావు

చెరుకుపల్లి: విద్యుత్‌శాఖ బాపట్ల డివిజినల్ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్‌గా జి.భాస్కరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో భాస్కరావు గుంటూరులో విధులు నిర్వహించి పదోన్నతి పై చెరుకుపల్లి వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన భాస్కరావును చెరుకుపల్లి విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏఈ పెరుగు శ్రీనివాసరావు, సబ్ ఇంజినీర్ అడుసుమల్లి దీప్తి, మండల విద్యుత్ శాఖ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.



ఏఎస్ఎన్ కళాశాలలో ర్యాంప్ వాక్‌లో మహిళలు



వీఎస్సార్ కళాశాలలో మహిళా దినోత్సవంలో మహిళలు



సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న సీయోను కుమారి



డాక్టర్ జీవనలత, జగదీశ్వరాంబలకు సన్మానం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారితకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. పురుషులకు దీటుగా మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందుడం శుభపరిణామమన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా సభ్యులకు అందిస్తున్న ప్రయోజనాలను ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే నేడు మహిళలు ఉన్నత స్థితిలో ఉంటున్నారని చెప్పారు. వారిన్ని ఆదర్శంగా తీసుకుని మహిళలు విద్యావంతులుగా మారాలన్నారు. అనంతరం చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్నలను ఘనంగా సన్మానించారు. అలాగే ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, మున్సిపల్ ఆర్‌ఓ రాంప్రసాద్, మెప్మా సీఎంఎం విజయకుమారి పాల్గొన్నారు.

\+ తాత్కాలిక ప్రలోభాలకు గురికాకుండా సమాజంలో ధైర్యంగా విద్యార్థినులు జీవించాలని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు ఫ్యాషన్ షో, డ్యాన్స్, పాటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్ మోటార్స్ ప్రతినిధి పి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి పాల్గొన్నారు.

\+ వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక, ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల్లో మహిళలు సత్తా చాటడం శుభపరిణామమని పేర్కొన్నారు. మహిళల రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వాలు తీసుకువస్తున్న చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ షీలా, కాత్యాయిని, దేవిప్రియా, షారోన్లీ పాల్గొన్నారు.

\+ ఐతానగర్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత వీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఆడపిల్లల ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను లెఫ్టినెంట్ కల్నల్ జి.సీయోను కుమారి కట్ చేశారు. మేజర్లు రత్న సుందరి, రాజకుమారి, మహిళలు పాల్గొన్నారు.

\+ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ వైద్యులు జీవనలత, ప్రముఖ న్యాయవాది జగదీశ్వరాంబ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో మహిళల పట్ల చూపుతున్న వివక్షను రూపుమాపే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు అరుణప్రభ, డీకే లక్ష్మీబేబి, రోహిణి, సంస్థ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

\+ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సెల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.సువర్ణరాణి మాట్లాడుతూ మహిళలు చదువుకుని జీవితంలో ఉన్నత స్థితిలో స్థిరపడాలని సూచించారు. కుటుంబానికి మహిళ వెలుగని చెప్పారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ, డాక్టర్ చిలువూరు సరోజిని, డాక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక



జేఎంజే కళాశాలలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎంపీడీఓ దీప్తి

మహిళలుగా పుట్టడం గర్వకారణం

తెనాలిటౌన్: మహిళగా పుట్టడం గర్వకారణమని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి అత్తోట దీప్తి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ అత్తోట దీప్తి పాల్గొని మాట్లాడారు. మహిళలుగా పుట్టడం మన అందరికి గర్వకారణమని తెలిపారు. కుటుంబ బాధ్యతను భుజాలపై వేసుకుని పిల్లలను తీర్చిదిద్దడంలో స్త్రీపాత్ర అద్వితీయమని పేర్కొన్నారు. ఇటీవల కొలకలూరు గ్రామంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం వివిధ పాఠశాలల మహిళా ఉపాధ్యాయినీలను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పొన్నెకంటి చక్రవర్తి, పొన్నెకంటి శశికిరణ్, విజయకుమారి, డాక్టర్ రత్నాకర్, హెచ్ఎం ఎం.నాగేశ్వరరావు, రిటైర్డ్ టీచర్ సుబ్బారావు, తుపాకుల ప్రసాద్, డ్వాక్రా యానిమేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో..

తెనాలిటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ మహిళా ఉద్యోగులు, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకకు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళ ఉద్యోగులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు ఐజే ప్రసాద్, ఎం.హదీరామ్ నాయక్, సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావు, ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్‌ఖన్నా, జిల్లా కార్యదర్శి ఈపూరి విజయ్‌కుమార్, కె.బాబు, ఎం.సుధాకర్, కె.సారమ్మ, సిహెచ్.విజయలక్ష్మి, శ్రీవల్లి, నిర్మలమ్మ పాల్గొన్నారు.



ఆర్టీసీ ఉద్యోగిని సత్కరిస్తున్న డిపో మేనేజర్ రాజశేఖర్

మహిళలు పురోభివృద్ధి అవసరం

తెనాలిరూరల్: మహిళలందరు అకుంఠిత దీక్షా దక్షతతో ప్రతి రంగంలోను అభివృద్ధి సాధించాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు అన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెనాలి కోర్టుల ప్రాంగణంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. సదస్సులో న్యాయమూర్తి ప్రసంగిస్తూ నేటి సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఇంకా కొన్ని చోట్ల స్త్రీలపై అఘాయిత్యాలు, వివక్ష కొనసాగతుండటం బాధాకరమన్నారు. పురుషులతోపాటు స్త్రీలు అన్ని రంగాలలో సత్తా చాటుతూ ముందుకు వెళుతున్నారని, దురదృష్టవశాత్తు మహిళలు పనిచేసే ప్రదేశాలలో, కళాశాలల్లో, గృహాలలో చెప్పరాని వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌కు, న్యాయస్థానాలకు రావటం తప్పుకాదని, స్త్రీకి జరిగిన అన్యాయానికి, హక్కుల ఉల్లంఘనకు చట్టరీత్యా పోరాటం చేసేందుకు న్యాయస్థానాలకు, పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. అర్హులైన మహిళందరికి మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చట్టాల గురించి అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నామని, ఆ చట్టాల గురించి తెలుసుకొని ప్రజలందరూ చైతన్యవంతులు కావలన్నారు. కార్యక్రమంలో మహిళా న్యాయవాదులు ఎం.విజయనిర్మల, రాజ్యలక్ష్మి, పుణ్యవతి, శారద, శ్యామల, పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

నేటి నుంచి తెనాలిలో అష్టోత్తర శతకోటి

శ్రీరామ నామ పారాయణ

- మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం
- తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహణ

తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కేంద్రంగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం ఆదివారం నుంచి ఆరంభం కానుంది. స్థానిక తాలూకా హైస్కూలు గ్రౌండ్‌లో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహక కమిటీ పూర్తి చేసింది. శనివారం అదే ప్రదేశంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. 2022 డిసెంబరు 25న అష్టోత్తర శతకోటి (108) శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగానూ, ఇతర రాష్ట్రాల్లోని భక్తులు పాల్గొన్నారు. పారాయణ పూర్తయిన నేపథ్యంలో వైఖానసాగమోక్తంగా పూర్ణాహుతి మహాయజ్ఞం తలపెట్టారు. ఆదివారం నుంచి 14వ తేదీ వరకు జరిగే మహాయజ్ఞంలో ప్రతిరోజు విశేష హోమాలు, కల్యాణాలు, ఉచిత సామూహిక పూజలు, ఆధ్యాత్మిక వేత్తల ప్రవచనాలు ఉంటాయని ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈఓ అవుతు శ్రీనివాస్ రెడ్డి, హరిప్రసాద్ తెలిపారు.



వివరాలు తెలియజేస్తున్న ఈఓ అవుతు శ్రీనివాస్, నిఖిల్ శాండిల్య

కార్యక్రమాలివిగో...

ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు 108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికల శోభాయాత్రతో వేడుకలు ఆరంభమవుతాయి. రాత్రి 7.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహం, దీక్షాధారణ, అంకురారోపణ ఉంటాయి. 10వ తేదీ ఉదయం ఆరు గంటలకు గోపూజతో ఆరంభించి, శ్రీసీతారాములకు పంచామృత స్నపన, 10 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణం జరుగుతుంది. 11.30కు బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తిచే ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటాయి. సాయంత్రం 6.45 గంటలకు అవధాన సరస్వతీపీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుంది. 11న ఉదయం 10 గంటలకు శ్రీరుక్మిణీ కళ్యాణం, 11.30 గంటలకు డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్, మాచిరాజు కిరణ్‌కుమార్, సాయంత్రం 6.45 గంటలకు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తారని తెలిపారు. 12న ఉదయం 9 గంటలకు శ్రీసీతారాముల కళ్యాణం, తదుపరి బ్రహ్మశ్రీ డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మతో ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం 6.45 గంటలకు సాయివేద వాగ్దేవితో భక్తిగీతాలాపన ఉంటాయి. 13న ఉదయం 9 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేకం, తదుపరి సుదర్శనం సీతారామాచార్యులతో ప్రవచనం, సాయంత్రం 6.45కు మహాసహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనం. 14వ తేదీ ఉదయం విశేష హోమం, పూర్ణాహుతి, 11.30కు శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం శ్రీ విద్యారణ్య భారతీస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం ఉచిత సామూహిక కుంకుమార్చన, 6.45కు డాక్టర్ గరికపాటి నరసింహారావుతో ప్రవచనం ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్ కుమార్, కల్లూరి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర చట్టం తీసుకురావాలి

కొల్లిపర: రైతులు పండిస్తున్న వివిధ పంటలకు మద్దతు ధర చట్టం అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, అన్నవరపు లంక గ్రామాలలో సోమవారం గుంటూరులోనే వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలంటూ రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల కిందట క్వింటాల్ పసుపు ధర 16,000 కాగా ప్రస్తుతం రూ.9500కి పడిపోయిందని, రూ.32,000 అమ్మిన మిర్చి పది పదకొండు వేలుకి పడిపోయిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. 14 నెలల కిందట శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో పసుపు కాలిపోయి, వంద కోట్ల రూపాయలు రైతుల నష్టపోయిన ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని ఆయన మండిపడ్డారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో క్వింటాల్ పరిస్థితి 7000 రూపాయలు ఇస్తామన్న వాగ్దానం 8 నెలలు గడిచినా అమలు కాలేదు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లంకిరెడ్డి నాగేశ్వర్‌రడ్డి, అచ్యుత, సురేష్, కేసరి మాధవరెడ్డి, రంగా కురవారెడ్డి, బొట్టు కోటిరెడ్డి, చంటి, అవుతూ రత్తారెడ్డి పాల్గొన్నారు .



మాట్లాడుతున్న ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివ సాంబిరెడ్డి

సీపీఐ(ఎంఎల్) సానుభూతిపరురాలు శాయమ్మ మృతి

తెనాలి: సీపీఐ(ఎంఎల్) సానుభూతిపరులు, రైతుకూలి సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు సతీమణి శాయమ్మ(66) శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. శాయమ్మ స్వస్థలం, ఒడిశాలోని కొరాపుట్ జిల్లా జైపూర్. ఆమె తండ్రి ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ ప్రెస్ వర్కర్స్ యూనియన్ బాధ్యునిగా ఉండే క్రమంలో రాజకీయ సంబంధాలలోకి వచ్చారు. తెనాలికి చెందిన బొల్లిముంత సాంబశివరావుతో వివాహానంతరం నిజాంపట్నం, రేపల్లె, విజయవాడ ప్రాంతాల్లో ఉన్నారు. 'జనశక్తి', ఇతర పత్రికల బైండింగ్, పోస్టింగ్ పనులు నిర్వహించారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

నూతక్కి అబ్రహాం సాహిత్యం చిరస్మరణీయం

తెనాలిటౌన్: మధురకవి నూతక్కి అబ్రహాం సాహిత్య చిరస్మరణీయమని ప్రముఖ సాహితీవేత డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అబ్రహాం జయంతిని కొలకలూరు గ్రామంలో శనివారం నిర్వహించారు. ఆది జాంబవ దళిత ఉద్యోగుల సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో అబ్రహాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీవేత డాక్టర్ భూసురపల్లి మాట్లాడుతూ అబ్రహాం రచనలలో కరుణ, రసాత్మకత ఉట్టిపడుతుందని తెలిపారు. ఒక మహాకవికి ఉండాల్సిన లక్షణాలన్ని అబ్రహాంలో ఉన్నాయని అన్నారు. అబ్రహాం సాహితీ విలువలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నాకర్, ఉన్నం యేహెస్కేల్, పెద్దెటి యోహాన్, గ్రామ మాజీ సర్పంచి వల్లూరి వరప్రసాద్, రచయిత బీఆర్, రంగస్థల నటుడు శరత్ వెంకయ్య, కోడూరు సుదర్శన్, యడ్లపల్లి రవికిరణ్, సుద్దపల్లి మురళీధర్, కొలకలూరు పాపారావు, తోట నాగేశ్వరరావు, కొలకలూరు నాగేశ్వరరావు, ఎనపాటి అనిల్, చందు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సాహితీవేత డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

రేపల్లె రూరల్: హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. మండలంలోని పోటుమెరక గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా హైందవ సంస్కృతి పరిరక్షణ, హిందూ ధర్మంలో స్త్రీల పాత్రపై నిర్వహించిన ఆధ్యాత్మిక సదస్సులో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మ సంస్కృతి పరిరక్షణలో మహిళల పాత్ర కీలకమన్నారు. ఆది పరాశక్తిగా, చదువుల తల్లిగా, సిరుల తల్లిగా మహిళలే ఆధిపత్యం వహించారని, అటువంటి స్త్రీలను ఎవరూ తక్కువగా చూడరాదని పేర్కొన్నారు. అనంతరం మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు రేపల్లె సుబ్బారావు, కోయ బ్రహ్మేంద్ర, గరికపాటి రేణుకస్వామి, ఫౌండేషన్ కన్వీనర్‌లు కోటేశ్వరరావు, జంగం శ్యామ్‌ప్రసాద్, కొంతి బాబూరావు, వీరరాగవయ్య, వీరబాబు, నాగరాజు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా సమావేశం

తెనాలి: మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా సమావేశం శనివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగింది. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాదిగ ఉద్యోగుల సమస్యలు, ఐక్యత అవసరంపై ఆయన మాట్లాడారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పొన్నెకంటి రవిబాబు మాదిగ, నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టిపోగు లక్ష్మణ్‌కుమార్ మాదిగ, ప్రొఫెసర్ పేజీ రత్నాకర్ మాదిగ, ఇందుపల్లి రాజారామ్ మాదిగ, సుద్దపల్లి సుకుమార్ మాదిగ మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి మాదిగ ఉద్యోగులు పాల్గొన్నారు.

రంగవల్లులతో రైతులకు అవగాహన

తెనాలిటౌన్: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం కొలకలూరులో నివాసం ఉంటున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం రైతులకు రంగవల్లులతో వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ కాలిశెట్టి ఫణీకుమార్, గ్రామ పెద్దల సహకారంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. వ్యవసాయ విద్యార్థులు పాల్గొని అందంగా రంగవల్లులు తీర్చిదిద్ది ఆధునిక వ్యవసాయంపై రైతులకు వివరించారు. అదే విధంగా తెలియని విషయాలను రైతులు నుంచి తెలుసుకుని తాము నేర్చుకున్న పలు అంశాలను రంగవల్లుల ద్వారా తెలియజేశారు. గ్రామ పంచాయతీ పరిసరాల్లో పంట స్వరూపాన్ని తెలిపే రంగవల్లులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చిత్రాలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో గ్రామ వీపీఏ నాగరాజు పాల్గొన్నారు.

అన్నదానం

తెనాలిటౌన్: వృద్ధులకు, అనాథలకు సేవ చేయడం మాధవ సేవ చేసినట్లేనని గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమం నాజర్‌పేట, మన ఇల్లు వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం చేశారు.